త్వరితగతిన కేసుల పరిష్కారం



న్యాయమూర్తులతో సమీక్షిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌రెడ్డి చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: న్యాయస్థాన కేసులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి సూచించారు. స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తులతో ఆదివారం వివిధాంశాలపై సమీక్షించారు. తొలుత ఏలూరు రెవెన్యూ అతిథి గృహానికి చేరుకున్న సురేశ్‌రెడ్డికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ స్వాగతం పలికి వేర్వేరుగా పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆపై పోలీసు గౌరవం వందనం స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి.. జిల్లా న్యాయస్థానానికి చేరుకుని సమీక్ష నిర్వహించారు. కేసుల విచారణ, న్యాయస్థానాల పనితీరుపై మాట్లాడారు. అనంతరం జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలోని వివిధ కోర్టులు, న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ కార్యాలయాలను పరిశీలించారు. చివరిగా న్యాయమూర్తులతో బృంద చిత్రం దిగారు. పలువురు న్యాయమూర్తులు, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, రెవెన్యూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• అక్రమాలకు ఉపాధి
• తీరంలో గుట్టలుగా వ్యర్థాలు
• అది చిరుతేనా!
6లో

నిఘా నిద్రకు.. రక్షణ గాలికి..



ఏలూరు సర్వజన ఆసుపత్రి ముఖ ద్వారం

గత ఏడాది ఏలూరు సర్వజన ఆసుపత్రి మాతా శిశు విభాగంలో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని మహిళా సెక్యూరిటీ గార్డులు గుర్తించారు. పసిపిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని అనుమానించి పోలీసులకు అప్పగించారు.

రెండు నెలల కిందట ఆసుపత్రి ప్రాంగణంలో నిలిపి ఉంచిన ఓ ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. దీనిపై బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

ఏడాదిన్నర కిందట ఆసుపత్రి విధుల్లో ఉన్న ఓ నర్సు బంగారు గొలుసు మాయమైంది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఓ మాజీ సైనిక ఉద్యోగి తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. తల్లిని చూసేందుకు వచ్చిన అతడి చరవాణి దొంగిలించారు.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో భద్రతపై నీలినీడలు
మందుబాబులు, దొంగలకు అడ్డాగా ఆవరణ
పనిచేయని సీసీ కెమెరాలు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇటీవల శవాల మాయం, ఇతర వరుస ఘటనలు అక్కడి భద్రతా వైఫల్యాలకు అద్దంపడుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది రోగులు, వారి కోసం వచ్చే బంధువులతో ఆసుపత్రి రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలక ప్రాంతంలో పూర్తిస్థాయిలో పనిచేయని సీసీ కెమెరాలు, అరకొర రక్షణ సిబ్బందితో దొంగలు, అక్రమార్కులు ఎవరి స్థాయిలో వారు రెచ్చిపోతున్నారు. ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలు, చరవాణులు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. ఇటీవల పోలీసు అధికారులు ఆసుపత్రిలోని భద్రత పరిస్థితులను పరిశీలించి, అక్కడి అధికారులతో మాట్లాడారు. పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని సమావేశపరిచి వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

చీకటిపడితే జాతరే.. సర్వజన ఆసుపత్రి ప్రాంగణం రాత్రైందంటే తిరుణాళ్లగా మారిపోతుంది. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు వచ్చేస్తుంటారు. అర్ధరాత్రి దాటిందంటే అత్యవసర విభాగం ముందే హడావుడి కనిపిస్తోంది. పలువురు యువకులు మద్యం తాగి ఆసుపత్రి ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలపై చెక్కర్లు కొడుతూ.. గొడవలు పడుతుంటారు. అత్యవసర విభాగంలోకి వచ్చే వైపు ప్రధాన ద్వారం బయట అర్ధరాత్రి దాకా కొంతమంది బండ్లు పెట్టుకుని అల్పాహారం అమ్ముతుంటారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి అక్కడకు వస్తుంటారు. వాళ్లలో కొంత మంది మందుబాబులు ఆసుపత్రిలోకి వచ్చి తిరుగుతుంటారు. లోపల నిర్జన ప్రదేశాల్లో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల కిందటి వరకూ కొందరు సిగరెట్లు, గంజాయి కూడా విక్రయించేవారని ఆరోపణలు ఉన్నాయి.


ఏలూరు: సిబ్బందికి సూచనలిస్తున్న పోలీసు అధికారి (పాతచిత్రం)

కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.. ‘ఆసుపత్రిలో భద్రతా చర్యలపై దృష్టి పెడతాం. ప్రాంగణంలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేసేలా ఏర్పాట్లు చేస్తాం. రాత్రి సమయాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తాం. ఆకతాయిలు రాకుండా కట్టడి చేస్తాం.’ అని ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు సుధాకర్ తెలిపారు.

300 పడకలు | **1,200** రోజువారీ రోగులు | **60** వైద్యులు | **380** సిబ్బంది | **55** సెక్యూరిటీ | **45** సీసీ కెమెరాలు | **20** అందులో పాడైనవి

శయన మహావిష్ణువుగా శ్రీవారు

ముగిసిన కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శేషాచలంపై కొలువైన వేంకటేశ్వరుడి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు రాత్రి పుష్పయాగోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. 12 రకాల వాయిద్యాలు, 12 గీతాలు ఆలపించి పవళింపు సేవ చేశారు. 12 రకాల పిండి వంటలు, పండ్లు నివేదించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. ఆలయ పండితులు ధాన్యం, పసుపు కొమ్ములను దంచగా వచ్చిన చూర్ణంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి.. చక్రస్నానం చేయించారు. ఆ పవిత్ర జలాన్ని భక్తులకు వసంతంగా చల్లారు. క్షేత్ర వీధుల్లో రాజాధిరాజ వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు విహరించారు. చివరి రోజు శ్రీవారు శయన మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


అలంకారంలో స్వామివారు


చూర్ణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

వాడపల్లిలో బ్రహ్మోత్సవ శోభ

నేడు అంకురార్పణ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లిలో బ్రహ్మోత్సవ శోభ వెల్లివిరుస్తోంది. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అభయ ప్రదానం చేసేందుకు స్వామివారు ముస్తాబై సకల సింగారాలతో మెరిసిపోతున్నారు. సోమవారం ఉదయం అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. సంప్రదాయం ప్రకారం మూడు రోజుల పాటు స్నప్న తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారన్నారు.



బుజ్జాయిలకు నచ్చేలా.. పెద్దలు మెచ్చేలా!

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆధునిక హంగులు



భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునిక హంగులతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చర్యలు చేపట్టింది. దీని కోసం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) పేరిట నూతన కార్యక్రమాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది.

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 489 కేంద్రాలను ఈ పథకానికి ఎంపిక చేశారు. ఆయా కేంద్రా పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, చిన్నారులకు ఆకట్టుకునేలా విద్యా బోధన ఈ పథకం లక్ష్యం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తామని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే పనులను వేగంగా పూర్తిచేస్తామని ఐసీడీఎస్ పీడీ సుజాతా రాణి తెలిపారు.

- చిన్నారుల మానసిక వికాసానికి అవసరమయ్యే ఆట వస్తువులతోపాటు, కుర్చీలు, టేబుళ్లు, కేంద్రాల నిర్వహణకు అవసరమయ్యే గ్యాస్ పొయ్యి, సీలింగ్ ఫ్యాన్లు, నీరు నిల్వ చేసే డ్రమ్ములు అందుబాటులోకి తేనున్నారు.
- ఎంపికైన కేంద్రాల్లో పోషణ వాటికల పేరిట కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసి వాటిని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారంలో వినియోగిస్తారు. వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు	1,626
పథకానికి ఎంపికైనవి	489
గర్భిణులు, బాలింతలు	16,011
ఆరేళ్లలోపు చిన్నారులు	63,477



దూసనపూడిలో అంగన్‌వాడీ కేంద్రం (పాత చిత్రం)

వికాసానికి విఘాతం


ఇరగవరం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


- భీమవరానికి చెందిన అయిదేళ్ల వివేక్‌కు కంటి పరీక్షలు చేయగా చూపు - 8గా నమోదు కావడంతో వైద్యులు కంగుతిన్నారు. చరవాణి ఎక్కువగా చూడటం వల్లే దృష్టి లోపం వచ్చిందని, ఇదే కొనసాగితే కంటి చూపు పోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులను హెచ్చరించారు.
- తణుకుకు చెందిన నాలుగేళ్ల ఐశ్వర్య చిన్నప్పుడే భూతద్దాల కళ్ల జోడును వినియోగించాల్సి వస్తోంది. మితిమీరి చరవాణి వినియోగించడంతో చూపు మందగించడంతో పాటు కనుగుడ్లు ఒకవైపు వచ్చేస్తున్నాయని, ఎదిగే కొద్దీ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, మొగల్తూరు, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ప్రతి వంద మంది పిల్లల్లో కనీసం 12 మంది తీవ్ర దృష్టి లోపంతో బాధపడుతున్నారని, పది మందిలో ఒకరికి కళ్లజోడు ఉన్నట్లు వైద్య గణాంకాలు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, చింతలపూడి ప్రాంతీయ ఆసుపత్రుల్లో సరాసరిన ఓపీ 350 ఉంటే, ఇందులో 60 మంది కేవలం కంటి సమస్యలతో వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. పాఠశాల, కళాశాలల్లో ఏ తరగతి గదిలో చూసినా సగం మంది విద్యార్థులు కళ్లద్దాలతోనే ఉంటున్నారు. ఇవి లేకుండా చదవడం, రాయడం, బోర్డు చూడటం వంటి పనులు చేయలేకపోతున్నారు.

వ్యక్తిగత నిర్లక్ష్యంతోనే.. చాలా మంది చిన్నారులకు కంటిచూపు సమస్య తలెత్తినా చెప్పుకొనే అవకాశం, ఆలోచన రాదు. వీటిని గుర్తించే బాధ్యత తల్లిదండ్రులతోపాటు గురువులు తీసుకోవాలి. చిన్న వయస్సులో దగ్గర, దూరం చూపు సక్రమంగా ఉంటేనే దృష్టి లోపాలు తలెత్తవు. తమ కళ్లను ఎక్కువ సమయాన్ని దగ్గర చూపునకు పరిమితం చేయడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నాలుగు గోడలకే పరిమితమై స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోవడంతో సమస్యలు కొనితెచ్చుకోవడం అవుతోందని నిపుణులు చెబుతున్నారు.



గత మూడేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలా..



సర్కారు ప్రత్యేక శ్రద్ధ

పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన కూటమి ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్‌బీఎస్‌కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల విద్యార్థులకు ఏడాది పొడవునా కంటి పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

మూడో ఏటే పరీక్షించాలి

పెరుగుతున్న సాంకేతికత, కాలుష్యంతో చిన్న, పెద్ద తేడా లేకుండా కంటిచూపు సమస్యలు ఎక్కువయ్యాయి. ఆసుపత్రికి వచ్చేవారిలో చిన్నారులే అధికంగా ఉంటున్నారు. పుట్టిన మూడో సంవత్సరంలోనే కంటి పరీక్ష తప్పనిసరిగా చేయించాలి. ప్రతి ఒక్కరూ ఏడాదికొకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

– కె.రాజబాబు, కంటి వైద్య నిపుణులు

పట్టభద్రుల ఎమ్మెల్సీపై తెదేపా గురి

అభ్యర్థిగా రాజశేఖర్ పేరు ప్రకటన

మొదలైన ఎన్నికల సందడి

కాకినాడ కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిని ప్రకటించారు. 2025 మార్చిలో ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో ఓటు నమోదు ఊపందుకుంది.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం అభ్యర్థిగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వేమవరానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ పేరును తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఖరారు చేయడంతో కూటమి శ్రేణుల్లో సందడి మొదలయ్యింది. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపి, విజయం సాధించేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కొద్ది రోజులుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అర్హత ఉన్న పట్టభద్రులతో ఓటు నమోదు చేయిస్తున్నారు.


తెదేపా అధినేత చంద్రబాబుతో రాజశేఖర్ (పాతచిత్రం)

నాడు 46 మంది బరిలో.. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం పీడీఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయనకు 2025, మార్చి వరకు పదవీ కాలం ఉంది. 2019, మార్చిలో జరిగిన ఎన్నికల్లో 46 మంది పోటీలో నిలిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే ఇళ్ల విజయం సాధించారు. పీడీఎఫ్ నుంచి ఈసారి ఇంకా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. కొందరు స్వతంత్రంగా పోటీ చేస్తామని చెబుతున్నారు. దీంతో ఎక్కువ మంది బరిలో ఉండే పరిస్థితి ఉంది.

సంఖ్య ఎక్కువే.. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,93,794 మందికి ఓటు హక్కు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,72,415, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 1,21,379 మంది ఓటర్లు అప్పట్లో ఉన్నారు. 293 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి.

ఇదీ ప్రస్తుత షెడ్యూల్.. ఈ నియోజకవర్గానికి తాజాగా ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చర్యలు చేపట్టారు. గత నెల 30న ఓటు నమోదు రిజిస్ట్రేషన్ ప్రకటన ఇచ్చారు.

ఓటు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ గడువు: **నవంబరు 6**

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ: **నవంబరు 23**

ఫారం-18 ద్వారా దరఖాస్తుల స్వీకరణ: **డిసెంబరు 9**

తుది ఓటర్ల జాబితా: **డిసెంబరు 30**

పాలకవర్గాలు తలెత్తుకునేలా చేశాం : మంత్రి నిమ్మల

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే ..కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు ఇచ్చి పాలకవర్గాలు తలెత్తుకునేలా చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల, బూరుగుపల్లి గ్రామాల్లో ‘పల్లె పండగ’ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీతో కలిసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.35 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. దొడ్డిపట్లలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. బాపూజీ కలలుగన్న స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు సమర్థవంతమైన నాయకుడు రామానాయుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే.. ఆయన మంత్రి స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ఆయా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, బన్నీ వాసు, ఆర్డీవో దాసిరాజు, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోణం నాని, గుబ్బల మోహన్ పాల్గొన్నారు.


బూరుగుపల్లిలో మంత్రి నిమ్మల, జడ్పీ ఛైర్‌పర్సన్ కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

40 రోజుల్లోనే.. నీటి సంఘాల ఎన్నికలు

☛ నేడు ప్రకటన ☛ సవరించిన ఉత్తర్వులు జారీ

ఉండి, కాళ్ల, న్యూస్‌టుడే: సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. సోమవారం జిల్లా ఎన్నికల అథారిటీ ప్రకటన విడుదల చేయనుందని సవరించిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఓటర్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ ప్రక్రియను 40 రోజుల్లో ముగించేలా రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియ గతంలో 90 రోజులు ఉండేది.


తూడు, చెత్తతో నిండిన వెలివర్రు పంట కాలువ

పునరుజ్జీవం దిశగా..! రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాలు 2003లో ఆవిర్భవించాయి. 2015లో ఈ ఎన్నికలు జరగగా కాలపరిమితి 2020తో ముగిసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో పంట బోదెలు, మైనర్, మీడియం డ్రెయిన్ల నిర్వహణ అటకెక్కింది. వర్షం కురిస్తే చాలు పల్లపు ప్రాంతాల్లో చేలు ముంపుబారిన పడి ఏటా అన్నదాతలు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ క్రమంలో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని ఎన్డీయే ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనిని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ నెల 21న కలెక్టర్లు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారు. ఎన్నికల అధికారుల నియామకాన్ని తొలి రోజే పూర్తిచేస్తారు. అనంతరం గ్రామాల వారీగా సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా తయారు చేస్తారు. నవంబరు 21-23 తేదీల మధ్య సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికలు పూర్తి చేయాలి. అదే నెల 24-26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27-29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ (పీసీ) కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.


పశ్చిమ డెల్టా ఆయకట్టు: 5,29,962 ఎకరాలు	మండలాలు 29
	నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏలు) 131
	జలవనరుల శాఖ సబ్ డివిజన్లు: 4 (ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం)

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీలు): 20 (నిడదవోలు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గుండుగొలను, పోతునూరు, తణుకు, అర్ధవరం, అనాకోడేరు, ఉండి, ఆకివీడు, అడవికొలను, నరసాపురం, అత్తిలి, పెనుమంట్ర, వీరవాసరం, భీమవరం, పాలకొల్లు, మార్టేరు, పెరవలి, సిద్ధాంతం)


అక్కడలా.. ఇక్కడిలా..



మొక్కల కోసం ఏర్పాటు చేసిన డ్రిప్



గొల్లగూడెం సమీపంలో ఎండిపోయిన ఇలా..



విర్డ్ ఆసుపత్రి సమీపంలో పూలతో కళకళలాడుతున్న విభాగిని

భీమడోలు జాతీయ రహదారి నుంచి ద్వారకాతిరుమల వెళ్లే రహదారి మధ్యలోని విభాగినుల్లో పలు చోట్ల గతంలో మొక్కలను నాటారు. నీటి వసతి కోసం డ్రిప్ (బిందు సేద్యం) పద్ధతులను అమర్చారు. నిర్వహణ కొరవడటంతో కొన్ని మొక్కలు ఎండిపోయాయి. విభాగినుల దిమ్మెలు విరిగిపోయి, నాచుపట్టి కళావిహీనంగా మారాయి. విర్డ్ ఆసుపత్రి నుంచి ఆలయ కూడలి వరకూ పచ్చదనాన్ని పరిరక్షించడంతో పూలతో అందంగా కనువిందు చేస్తోంది. మిగిలిన ప్రాంతమంతా వెలవెలబోతోంది. అధికారులు పరిశీలించి విభాగినులను బాగుచేసి, పచ్చదనాన్ని పెంపొందించి, సుందరంగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. - ఈనాడు, ద్వారకాతిరుమల.

అక్రమాలకు ఉపాధి

నలుగురు సిబ్బంది సస్పెన్షన్



ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో కూలీల పేరుతో వేతనాలు కాజేసినా... అప్పుడు హాజరులో అక్రమాలకు పాల్పడినా... తక్కువ వ్యవధిలో చేసిన పనిని ఎక్కువగా చూపి నిధులు నొక్కేసినా గత వైకాపా సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు. వాటిని గుర్తించి చర్యలకు సిఫార్సు చేయాల్సిన సామాజిక తనిఖీలు సైతం తూతూమంత్రంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన తనిఖీల్లో అవి బయటపడుతున్నాయి.

● ఆచంటలో పనులు చేసేందుకు కొంతమంది కూలీలు వచ్చినా రాకపోయినా మస్తర్లు వేయడం, జాబ్‌కార్డులు సృష్టించి కూలి డబ్బులు చెల్లించినట్లు చూపించి అధికారులు చేతివాటానికి పాల్పడ్డారు. నివేదికలో బయట పడటంతో క్షేత్ర, సాంకేతిక సహాయకులిద్దరినీ (ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు) సస్పెండ్ చేశారు.

● పెనుగొండ మండలంలో పని చేసేందుకు కూలీలు రాకపోయినా మస్తర్లు వేయడం బయట పడటంతో ఇద్దరు క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశారు.

సామాజిక తనిఖీతో..

గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు, క్షేత్ర స్థాయి సహాయకుల నిర్వాకంతో ఉపాధి పథకం లక్ష్యం నెరవేరలేదు. జాబ్‌కార్డులుండి పని చేయని వారికి తప్పుడు మస్తర్లతో నగదు జమయ్యేలా చేశారు. ఈ ఏడాది చేపట్టిన సామాజిక తనిఖీ నాలుగు మండలాల్లో పూర్తవగా నలుగురు అధికారులను సస్పెండ్ చేశారంటే పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. ఇంకా 16 మండలాల్లో సర్వే చేపట్టాల్సి ఉండటంతో మిగిలిన వారికి గుబులు పట్టుకుంది. ఆరోపణలు రుజువైతే, విధుల నుంచి వైదొలగిన సిబ్బంది నుంచి నగదు రికవరీ చేసేందుకు రెవెన్యూ సిబ్బందికి సిఫార్సు చేశారు. ఈ ఏడాది పనులు మరో నాలుగైదు నెలల్లో ముగుస్తున్న నేపథ్యంలో సామాజిక తనిఖీలు పూర్తి పారదర్శకంగా జరిగితే మరిన్ని అక్రమాలు బయటకొచ్చే అవకాశం ఉంది. 'ఆరోపణ ఉన్న సిబ్బందికి నోటీసులిచ్చాం.' అని డ్వామా పీడీ అప్పారావు పేర్కొన్నారు.

మండలాలు	జాబ్‌కార్డులు	యాక్టివ్‌గా ఉన్నవి	రోజువారీ కూలీ	దుర్వినియోగమైన నిధులు	సిబ్బంది నుంచి రికవరీ చేసింది
20	1,65,058	94,967	రూ. 300	రూ. 2.24 కోట్లు	రూ. 1.99 కోట్లు

ఉత్కంఠగా అంతర కళాశాలల కబడ్డీ పోటీలు

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు, సౌత్‌జోన్ కబడ్డీ జట్టు ఎంపిక ప్రక్రియ మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి సుమారు 250 మంది పాల్గొన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలకు 16 జట్లు పోటీపడగా అంతర కళాశాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ ఐడియల్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా పీఠర్ కళాశాల ద్వితీయ స్థానం, మండపేట జట్టు తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. 16 మంది క్రీడాకారులను యూనివర్సిటీ తరపున ఎంపిక చేశారు. వీరు ఈ నెల 30న చెన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర కళాశాల పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక



నాయకులను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వాహన చోదకుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక సంఘ భవనంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘాధ్యక్షుడిగా తోట శ్రీనివాసరావు ఎన్నుకున్నారు. ఆయన ఏడాదిపాటు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు జి.ఈశ్వరరావు అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు డీఎస్ కొండయ్య వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా కె.చిరంజీవి, సహాయ ఎన్నికల అధికారిగా వి.పాపారావు పర్యవేక్షించారు. రాష్ట్ర సలహాదారు వై.నాగరాజు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు డి.వేణుగోపాలరావు, వైజీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సగటు వర్షపాతం 15.5 మి.మీ.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 15.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మొగల్తూరు మండలంలో 42.4 మి.మీ. వర్షం కురిసింది. భీమవరం 36.2, పాలకొల్లు 36, యలమంచిలి 26.4, పెనుగొండ 23.6, నరసాపురం 21.4, వీరవాసరం 21.2, ఆచంట 20, పోడూరు 17.2, తణుకు 13.6, పాలకోడేరు 12.2, కాళ్ల 11.2, ఉండి 10.4, మిగిలిన మండలాల్లో పది మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

తీరంలో గుట్టలుగా వ్యర్థాలు..!



నిరుపయోగంగా చెత్తను వేరుచేసే యంత్రం



వృథాగా పడి ఉన్న భారీ యంత్రాలు

నరసాపురం గోదావరి తీరంలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వీటిని వేరుచేసి సంపద తయారు చేసేందుకు తెచ్చిన యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్గంధం భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును గోదావరి తీరం నుంచి దూరంగా తరలించాలని వారంతా కోరుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ మల్లారపు అంజయ్య మాట్లాడుతూ డంపింగ్‌యార్డు తరలింపునకు రుస్తుంబాదలో 4.20 ఎకరాల స్థలాన్ని పరిశీలించామని ఇందుకోసం రూ.3.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకూ ఉన్న వ్యర్థాలను యంత్రాలతో రీసైకిలింగ్ చేయిస్తామన్నారు. ఎస్టీపీ ప్లాంటు కోసం రూ.2.12 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. - ఈనాడు, నరసాపురం.

వెల్లమిల్లి వాసికి రైతు నేస్తం పురస్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న పూర్వపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: వెల్లమిల్లికి చెందిన రైతు పరిమి సత్యనారాయణకు రైతు నేస్తం పురస్కారం లభించింది. పూర్వపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఆదివారం రైతునేస్తం 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సుమారు 20 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్త ఐ.వి.సుబ్బారావు పేరిట ముప్పవరపు ఫౌండేషన్‌తో 'రైతు నేస్తం' పురస్కారాలు ప్రదానం చేశారు.

టెట్‌కు 83 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాల్లో ఆదివారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రెండు విడతల్లో జరిగింది. మొత్తం 620 మంది అభ్యర్థులకు 83 మంది గైర్హాజరైనట్లు డీఈవో జి.నాగమణి తెలిపారు.

వలకు చిక్కిన భారీ పండుగప్ప



పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దొంగరావిపాలెం వద్ద గోదావరిలో ఆదివారం జాలరు కె.సత్యనారాయణ చేపలు పట్టేందుకు వల వేయగా సుమారు 8 కిలోల పండుగప్ప చేప చిక్కింది. ఈ చేపను సిద్ధాంతం మార్కెట్లో తీసుకురాగా రూ.5000 ధర పలికింది.

ముగిసిన ఓపెన్ సైట్ క్యాటగిరీ

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్‌సైట్ క్యాటగిరీలు ఆదివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి విజేతల వివరాలను వెల్లడించారు. ఈ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతరపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు.

● **అండర్-14 బాలికల విభాగంలో..** మొదటి స్థానం కర్నూలు, ద్వితీయ స్థానం పశ్చిమ గోదావరి జిల్లాలు నిలిచాయి.



జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే జట్టు

బాలుర విభాగంలో: మొదటి స్థానం పశ్చిమ గోదావరి, ద్వితీయంలో కర్నూలు.

● అండర్-17 బాలికల విభాగంలో.. పశ్చిమ, కర్నూలు మొదటి, ద్వితీయ స్థానాలు సాధించాయి.

బాలుర విభాగంలో.. మొదట కర్నూలు, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా

● **అండర్-19 బాలికల విభాగంలో..** వైఎస్ఆర్ కడప, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి.

బాలుర విభాగంలో.. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి. వీరికి డీవైఈవో నారాయణ బహుమతులు అందజేశారు. ప్రతిభా వంతులను గుర్తించి జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే జట్టును ఎంపిక చేశామన్నారు. పాఠశాల ఛైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ స్వరూపరెడ్డి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెం సౌత్‌లో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆమె బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 19న వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని తమకు సమాచారం అందించారని బంధువులు తెలిపారు. కొంతకాలంగా ఆమెను భర్త హింసిస్తున్నాడని, అతనే హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

వెంటాడిన గొలుసు దొంగలు
వాహనం అదుపుతప్పి దంపతులకు తీవ్ర గాయాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాంతాల్లో గొలుసు దొంగలు చెలరేగిపోతున్నారు. వీరి దాడిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడిన ఘటన పాలకోడేరు మండలం గరగపర్రులో జరిగింది. ఎస్సై ఎం.రవివర్మ కథనం ప్రకారం.. గరగపర్రు వాసి చామన శ్రీను తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి భీమవరం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గొల్లలకోడేరు దాటాక నాగముని ఆలయం సమీపాన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వారిని వెంబడించి శ్రీను భార్య మెడలో బంగారు గొలుసును లాగారు. ఆమె ప్రతిఘటించడంతో పెనుగులాట చోటు చేసుకుని శ్రీను దంపతులు కిందపడిపోయారు. శ్రీనుకు కాలు విరగగా అతడి భార్య తలకు తీవ్ర గాయమైంది. దొంగల కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని చించినాడ వశిష్ఠ గోదావరి వంతెనపై నుంచి దూకి యువకుడు గల్లంతయిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుందని యలమంచిలి ఎస్సై గుర్రయ్య తెలిపారు. చించినాడ వంతెనపై బూట్లు ఉండటం గమనించిన స్థానికులు తమకు సమాచారం అందించారన్నారు. హుటాహుటిన అక్కడకు వెళ్లి గాలిస్తుండగా పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన ఈదా కోదండరామ్(19) గోదావరిలో దూకినట్టు అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో దూకిన యువకుడు వివరాలు తెలిశాయన్నారు. యువకుడు బూట్లు వంతెనపై వదిలేసి ఎక్కడికైనా వెళ్లాడా లేక గోదావరిలో దూకి గల్లంతయ్యాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భద్రత.. భరోసా

● అలుపెరగని సేవలందిస్తున్న పోలీసులు

● నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒంటిపై ఖాకీ.. చేతిలో లాఠీ.. తలపై మూడుసింహాల టోపీతో రోడ్డుపై ఓ పోలీసు ఠీవిగా వెళ్తుంటే ప్రజలకు ఓ భరోసా.. పోలీసులు ఉన్నారన్న భద్రతాభావం కలుగుతుంది. సమాజంలో శాంతిభద్రల పరిరక్షణకు పోలీసులు రాత్రింబవళ్లు తేడా లేకుండా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో మానసిక, శారీరక ఒత్తిళ్లు అధిగమిస్తూ... బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పోలీసు వ్యవస్థ సంక్షేమానికి ప్రభుత్వాలూ పెద్దపీట వేస్తున్నాయి. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కథనం.



ఆరోగ్యానికి పెద్దపీట

పోలీసులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు ఏలూరులో ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఒక వైద్యుడు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో సిబ్బంది, వారి కుటుంబీకులు వైద్యం పొందుతున్నారు. దీనికితోడు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. నిపుణులతో వివిధ పరీక్షలు చేయిస్తున్నారు. పని ఒత్తిడిని అధిగమించి మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కల్పించేలా పోలీసు జిమ్ ఏర్పాటు చేశారు. అన్ని రకాల వ్యాయామాలకు అత్యాధునిక పరికరాలున్నాయి. సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు ఇక్కడ సాధన చేయొచ్చు. సురేశ్ బహుగుణ ఆంగ్ల మాధ్యమ పోలీసు పాఠశాల నిర్వహిస్తున్నారు.



ఆర్థిక తోడ్పాటు..

పోలీసుల సంక్షేమానికి ఆర్థిక తోడ్పాటునందించాలన్న ఉద్దేశంతో శాంతినగర్ అడ్డరోడ్డులో ఏడేళ్ల కిందట పెట్రోలు బంక్ ప్రారంభించారు. ప్రస్తుతం రెండో బంక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. పోలీసు కల్యాణ మండపం, వేడుక హాలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమ నిధికి కేటాయిస్తున్నారు. 'పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. సమాజ శ్రేయస్సుకు రక్షకభటులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. వారి కుటుంబాలకు ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తాం. అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన పోలీసు కుటుంబాలను ఆదుకుంటున్నాం. వారికి శాఖాపరంగా రావాల్సిన సొమ్ము త్వరితం అందేలా చూస్తున్నాం. కారుణ్య నియామక ప్రక్రియ వేగంగా జరిగేలా దృష్టి పెట్టాం' అని ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

తక్కువ ధరకే సరకులు



బహిరంగ విపణి కంటే తక్కువ ధరలకు పోలీసు కుటుంబాలకు నిత్యావసర సరకులు, ఇతర గృహోపకరణాలు అందుబాటులోకి తీసుకొస్తూ పదేళ్ల కిందట ఏలూరులో పోలీసు రాయితీ క్యాంటీను ఏర్పాటు చేశారు. అక్కడ పోలీసు కుటుంబాలకు చెందిన వారే పని చేస్తున్నారు. పోలీసు కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణాలిస్తూ వారి కుటుంబాల్లో శుభకార్యాలు, పెళ్లిళ్లు, పిల్లల ఉన్నత చదువులకు తోడ్పాటునందిస్తున్నారు. పోలీసులకు ప్రత్యేకంగా గ్యాస్ ఏజెన్సీ పాయింట్ ఏర్పాటు చేసి.. సిలిండర్లు సరఫరా చేస్తున్నారు.

జిల్లా సమాచారమిలా..

పోలీసు స్టేషన్లు: 32

పోలీసులు: 2 వేల మంది

హోంగార్డులు: 950

అది చిరుతేనా..?

భయాందోళనకు గురవుతున్న ప్రజలు



భీమడోలు, ద్వారకాతిరుమల-న్యూస్‌టుడే: భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసరాల్లో చిరుత సంచరిస్తోందన్న ప్రచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. అందనాలమ్మ చెరువు ప్రాంతంలో గుర్తించిన జంతువు అడుగులు చిరుతవేనని అటవీ, పోలీసు అధికారులు ప్రాథమికంగా అంచనాకొచ్చారు. స్థానిక రైతులు మాత్రం సంచరిస్తోంది చిరుత కాదని.. అడవి పిల్లి అని చెబుతున్నారు. స్థానికంగా కొన్నాళ్లుగా అడవి పిల్లి తిరుగుతోందన్న వారు. అడుగు జాడలు సైతం దానివేనని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. అటవీ శాఖాధికారులు ఆదివారం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో జంతువు అడుగుల నమూనాలు సేకరించి రాజమహేంద్రవరంలోని పరిశోధన కేంద్రానికి పంపారు.

చోరీ కేసులో పాత నేరస్థుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వాసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన పలు కేసుల్లో నిందితులను ఆదివారం అరెస్టు చేశామని నరసాపురం గ్రామీణ సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రామన్నపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త కడలి వెంకటలక్ష్మి గత నెల 14న ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఆ సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి సుమారు రూ.1.50 లక్షల విలువగల బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. గతంలో పలు దొంగతనాల కేసుల్లో జైలు జీవితం గడిపిన సమయంలో పరిచయమైన వ్యక్తులు తిరిగి నేరాలకు పాల్పడుతున్నారని తెలుసుకున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన మట్టపర్తి రాజకుమార్ మరొక వ్యక్తితో కలిసి ఈ ప్రాంతానికి రాగా.. వారికి నేరాల్లో మిత్రుడైన పసలదీవికి చెందిన అల్లం రాము వసతి కల్పించాడు. పలు పర్యాయాలు రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న వెంకటలక్ష్మి ఇంట్లో చోరీకి పాల్పడ్డారని రాజకుమార్, రామును అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఈ కేసులో మరొక వ్యక్తి పరారయ్యాడని, త్వరలోనే అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై జి.వాసు, ఏఎస్సై యు.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించిన మహిళలు..



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి అభరణాలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: బంగారు, వెండి అభరణాలు చోరీ కేసులో ముగ్గురు మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లి గ్రామానికి చెందిన యర్రసాని సత్యమ్మ, రవాడ సత్యవతి, పటనాల ముత్యాలమ్మ కూలీలు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీళ్లు చోరీలకు అలవాటు పడ్డారు. 8న గుంటూరు పట్టాభిపురానికి చెందిన పానుగోటి సంజన శ్రీలక్ష్మీ తన తల్లిదండ్రుల ఇంటికి నరసరావుపేట వచ్చింది. ఈ సమయంలో బంగారు, వెండి అభరణాలు మార్చుకునేందుకు తండ్రి వెంకట్రావుతో కలిసి శ్రీరాంపురంలో ఓ బంగారు దుకాణానికి వెళ్లింది. అభరణాలు మార్చుకుని దుకాణం నుంచి బయట రావడం చూసిన ముగ్గురు నిందితులు వారి వాహనానికి అడ్డుపడి చేతిలోని హ్యాండ్‌బ్యాగు దొంగలించి ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆదివారం పట్టణంలోని వినుకొండ పైవంతెన సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను తనిఖీ చేసి వారి నుంచి మూడు బంగారు గొలుసులు, మూడు స్టెప్పుల బంగారు గొలుసు, వెండి పట్టీలు, మెట్టెలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. సమావేశంలో సీఐ విజయ్ చరణ్, ఎస్సై వంశీకృష్ణ ఉన్నారు.

భీమవరం

● భీమవరం ● ఉండి

నివాస ప్రాంతంలో మద్యం దుకాణమా..?



ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు పరిధి గొల్లలకోడేరు రహదారిలో నివాస ప్రాంతంలో మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. దీనిపై వివేకానంద కాలనీ వాసులు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఎక్సైజ్ సీఐ బల రామరాజులకు ఆదివారం వినతి పత్రాలు అందజేశారు. అక్కడ మద్యం దుకాణం ఏర్పాటుతో కాలనీవాసులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467

కాళ్ల : 80085 74474

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: కొవ్వాడ పుంతలో నివాసాల మధ్య అంతర్గత రహదారిపై వాననీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- రమేశ్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- శ్యాం, పంచాయతీ కార్యదర్శి**

ఉండి, న్యూస్‌టుడే

సమస్య : ఉండి, రామాపురం, పాములపర్రు గ్రామాల్లో రహదారులు భారీ గుంతలతో అధ్వాన స్థితికి చేరాయి. **- సూర్యనారాయణ, పాములపర్రు**

సమాధానం : వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేపడతాం. **-కె.శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ**

ఆకివీడు, న్యూస్‌టుడే

సమస్య: ఆకివీడు పరిధి మాదివాడ ప్రాంతంలో రాళ్లచెరువు పక్కన సీసీ రోడ్డుపై రోజుల తరబడి వాననీరు, మురుగు నిలిచిపోతోంది. **- స్థానికుడు**

సమాధానం: మురుగు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం. **-వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

వైభవంగా కల్యాణోత్సవం

ఆకివీడు, న్యూస్‌టుడే: కుసుమ హరనాథ లీలా కల్యాణ మహోత్సవాన్ని ఆకివీడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్త బృందం సభ్యులు భజనలు చేశారు.



వేడుకలో పాల్గొన్న భక్తులు

అయిదేళ్లుగా.. పునాదులూ పడలే..!

శివారు కాలనీల్లో తాగునీటి వెతలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

భీమవరం ఒకటో పట్టణ పరిధిలో అయిదేళ్ల క్రితం అప్పటి పాలకమండలి హయాంలో తాగు నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అంతలోనే ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. వైకాపా పాలకులు 2020 జనవరి 10న మళ్లీ శంకుస్థాపన చేశారు. తరువాత దీని పురోగతిని పట్టించుకోలేదు. ఫలితంగా జిల్లా కేంద్రమైన భీమవరంలో పలు ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

అంచనా వ్యయం పైపైకి..

కొత్త రిజర్వాయరు నిర్మాణానికి 2014లో 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్లు కేటాయించారు. నిర్మాణం చేయాల్సిన స్థలంపై వివాదం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో అప్పట్లో పనులు ఆగిపోయాయి. గత పాలకమండలి హయాంలో స్థల వివాదాన్ని పరిష్కరించారు. తరువాత పురపాలక సాధారణ నిధులు రూ.3.20 కోట్లు కేటాయించారు. నిబంధనల మేరకు ఈ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అంగుళం పని జరగలేదు. గత కొన్నేళ్లుగా శిథిల రిజర్వాయరునే వినియోగిస్తున్నారు. ఏమాత్రం తేడా వచ్చినా పట్టణంలో 10 వార్డులకు నీటి సరఫరా ఆగిపోతుంది.



భీమవరం పట్టణంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు గతంలోనే శిథిలమైంది. దీనిస్థానే చేపట్టిన కొత్త నిర్మాణం పునాదుల దశకూడా దాటలేదు. దీంతో శిథిలమైన రిజర్వాయరు ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు.



కొత్త ట్యాంకు నిర్మాణానికి పునాది తవ్వి వదిలిన ప్రాంతం

ఆలస్యం ఎందుకో..?

అయిదేళ్ల క్రితం పని ప్రారంభించిన గుత్తేదారు బిల్లు చెల్లింపు విషయమై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పని నిలిచిందని ఎంఈ పి.త్రినాథరావు చెప్పారు. సంబంధిత గుత్తేదారుని పిలిచి చర్చలు జరిపినట్లు తెలిపారు. గత ఒప్పందాన్ని రద్దు చేసి తాజాగా అమృత్ 2.0 నిధులతో మళ్లీ టెండరు పిలిచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అంశాన్ని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా జాప్యానికి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కనకదుర్గమ్మకు మహా నైవేద్యం



అన్న సమారాధన ప్రారంభిస్తున్న మోషేను రాజు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం నాచువారి కూడలిలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో అన్న కుంభం పోసి మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నసమారాధనను మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ప్రారంభించారు. ● శ్రీరామపురం కూడలిలో కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధన సేవ కార్యక్రమం ప్రారంభించారు.

విజేతలకు బహుమతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని త్యాగరాజ భవనంలో శనివారం జరిగిన సెకండ్ ర్యాంకింగ్ చదరంగం పోటీల్లో విజేతలకు బహుమతులను ట్రాఫిక్ సీఐ నారాయణ మూర్తి ఆదివారం అందజేశారు. అరసవల్లి ఈశ్వరమ్మ, వీరవెంకటాచారి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి బాలసుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం కమిటీ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.కిశోర్ తెలిపారు.

నేత్రాలపై అశ్రద్ధ వద్దు

చినకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు, చినకాపవరం లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. చినకాపవరంలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్ ప్రాంగంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటి ఆరోగ్యంపై అశ్రద్ధ వహించవద్దని వైద్యులు సూచించారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	ఇద్దరు
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కల్లు కాంపౌండ్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రంగరాజు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండురోజుల పాటు జరిగిన జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. పురుషుల విభాగంలో నరసరావుపేట, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలు తొలి రెండు స్థానాల్లో, కృష్ణాజిల్లా పరిటాల అమృతసాయి, నంబూరు వి.వి.ఐ.టి కళాశాలలు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో విజేతగా భీమవరం శ్రీవిష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల బృందం నిలిచింది. ద్వితీయ స్థానంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్, తృతీయ స్థానంలో గుడ్లవల్లేరు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలు నిలిచాయి. ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రంగరాజు, ప్రధానాచార్యుడు మురళీకృష్ణంరాజు, పోటీల కమిటీ కన్వీనర్, పీడీ పి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

వేగంగా అభివృద్ధి పనులు

వీరవాసరం, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' వారోత్సవాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. పెర్కిపాలెం, చింతలకోటిగరువు, వీరవాసరం గ్రామాల్లో రూ. 55 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. చింతలకోటిగరువులో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్‌నాయుడు, సర్పంచులు దాసరి మహాలక్ష్మి, చికిలే మంగతాయారు, ఎంపీటీసీ సభ్యులు గుల్లిపల్లి విజయలక్ష్మి, యాళ్లబండి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

నేడు అత్యవసర సమావేశం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ పాలకమండలి అత్యవసర సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.

రహదారులు మరమ్మతులకు ప్రణాళిక

కాళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా కాళ్ల, కోపల్లె గ్రామాల్లో సీసీ రహదారులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. సర్పంచులు బందా విజయ, బూది నాగమణి, తెదేపా మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, ఉప సర్పంచులు బూది వెంకటపద్మ, పి.వెంకటేశ్వరరావు, వీరవల్లి సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● సీసలి గ్రామంలో సర్పంచి బి.ధనలక్ష్మి, వేంపాడు ఇందిరమ్మ కాలనీలో తెదేపా గ్రామ అధ్యక్షుడు వి.వేణుగోపాల్ సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజలు చేశారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: శృంగవృక్షంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారుల నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. సర్పంచి జంగం సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సత్యకృష్ణ, తెదేపా నాయకులు కలిదిండి కృష్ణంరాజు(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ప్రమాదకరంగా శిథిల వంతెన

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల పరిధిలో చినకాపవరం మురుగు కాలువపై ఉన్న కోళ్లపర్రు వంతెన గతంలోనే శిథిలావస్థకు చేరింది. సెప్టెంబరులో కొల్లేరు వరద ప్రభావంతో ఈ వంతెన 15 రోజుల పాటు ఇలా ముంపులోనే ఉండటంతో పలు చోట్ల రంధ్రాలు ఏర్పడి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కోళ్లపర్రు, రాజులపేట తదితర గ్రామాల ప్రజలు, రైతులు ఈ వంతెన మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉన్నా అమలు కావడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు స్పందిస్తూ నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



ప్రయాణమంటే సాహసమే..!

వీరవాసరం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారులన్నీ దయనీయంగా మారాయి. గత రెండు, మూడు నెలల్లో మరమ్మతులు చేసిన రహదారులపై మళ్లీ భారీ గుంతలు ఏర్పాడ్డాయి. వీరవాసరంలో 165వ నంబరు జాతీయ రహదారితో పాటు వీరవాసరం- పెనుమంట్ర మార్గం అధ్వానంగా మారడంతో వాహన చోదకులు హడలిపోతున్నారు. వీరవాసరం-పెనుమంట్ర రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వం రూ. 3 కోట్లు విడుదల చేసింది. ఎన్నికల తరువాత గుత్తేదారు మరమ్మతులు ప్రారంభించినా వర్షాల కారణంగా నిలిపివేశారు. ప్రస్తుత వర్షాలకు ఈ మార్గంలో తోకలపూడి, పంజావేమవరం, నవుడూరు తదితర గ్రామాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ డీఎస్ఎన్ మూర్తి స్పందిస్తూ గుత్తేదారునితో మాట్లాడి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



పంజావేమవరం వద్ద ఏర్పడిన గుంతలు

ఆరోగ్య కేంద్రం.. అవస్థల మయం!

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శ్లాబు నుంచి వాననీరు లీకవుతుండటంతో ఇలా ప్లాస్టిక్ తొట్టెలు ఉంచారు. ఈ గదిలోనే వైద్యులు రోగులను పరీక్షించి చికిత్స చేస్తారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోగులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. మందులు నిల్వ చేసే గది, ఆపరేషన్ థియేటర్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ అంశంపై వైద్యాధికారి సునీల్ స్పందిస్తూ పాత భవనం కావడంతో సమస్యలు ఎదురవుతున్నాయని.. ఈ పరిస్థితిని జిల్లా వైద్యాధికారి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.



కళాశాలకు నాక్-ఎ గ్రేడ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్ పీజీ, డిగ్రీ కళాశాలకు నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు లభించిందని ప్రధానాచార్యుడు సకుమళ్ల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 30, ఈ నెల 1వ తేదీల్లో నాక్ బృందం కళాశాలను పరిశీలించిందన్నారు. కరస్పాండెంట్, కార్యదర్శి చీడే సత్యనారాయణ, కోశాధికారి వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, JAMPA MEENAKSHI W/o. Tekkali Baburao, Resident of D.No.9-73, Kondrothu Peta, Near E-Seva, Undi Village, Undi Mandal, West Godavari District - 534199, A.P. have changed my Name from TEKKALI MEENA (OLD NAME) to JAMPA MEENAKSHI (NEW NAME) Hence forth Iam being called as JAMPA MEENAKSHI (NEW NAME) for all purposes.

జూద శిబిరంపై దాడి.. ఏడుగురి అరెస్టు

కలిగొట్ల (ఉండి), న్యూస్‌టుడే: కలిగొట్లలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఉండి పోలీసులు ఆదివారం తెలిపారు. నిడమర్రు మండలం భువ్వనపల్లి గ్రామానికి చెందిన బాబ్జీతో పాటు మరో ఆరుగురు జూదాలడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ నసీరుల్లా, సిబ్బంది దాడి చేశారు. వారి నుంచి రూ. 95 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

తోకతిప్ప(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం తోకతిప్పలో జూద స్థావరంపై దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ స్టేషన్ రైటర్ మహేశ్ తెలిపారు. వారి నుంచి రూ.16,830 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

15 మందిపై రౌడీషీట్లు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణ పరిధిలో కొత్తగా 15 మందిపై రౌడీషీట్లు తెరిచినట్లు సీఐ జి.కాళీచరణ్ చెప్పారు. కొంతకాలం నుంచి వారిపై నమోదైన కేసుల ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. వీరికి స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృథాగా అధునాతన భవనం



కొన్నేళ్లనాటి ఈ శిథిల షెడ్లలోనే ప్రస్తుతం చేపల విక్రయాలు కొనసాగుతున్నాయి. పైకప్పు దెబ్బతినడంతో రేకులకు దన్నుగా ఉంచిన కర్రలు తరచూ జారిపడుతున్నాయి.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో మెంటేవారితోటకు వెళ్లే రైల్వే దిగువ వంతెన పక్కన అధునాతన చేపల మార్కెట్ దుకాణ సముదాయాన్ని నేషనల్ ఫిషరీస్ డవలప్‌మెంట్ బోర్డు నిధులు రూ.195.83 లక్షలతో నిర్మించారు. దీనిని ప్రారంభించినా దుకాణాలు అప్పగించడంలేదని వ్యాపారులు చెప్పారు. ఈ అంశాన్ని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వ్యాపారులకు గదులను వెంటనే కేటాయిస్తామన్నారు.



భీమవరంలో బుధవారం మార్కెట్ పరిధిలో నిర్మించిన అధునాతన చేపల మార్కెట్ సముదాయం ఇది. ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. అప్పటి నుంచి వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

శుచిగా.. సురక్షితంగా

వీధుల్లోనూ నాణ్యమైన ఆహారం

మెప్మా శిక్షణతో ఎంతో మేలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షిత, నాణ్యమైన ఆహారం అందాలనే ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చే దిశగా చిరు వ్యాపారులు సహకరిస్తున్నారు. మెప్మా, ఎన్‌ఏఎస్‌వీఐ సంస్థ, ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు ఆహార భద్రత, ప్రమాణాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించారు. శిక్షణ పొందినవారంతా నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా.. తెలుసుకొనేందుకు మెప్మా అధికారులు క్షేత్ర పరిశీలన చేస్తున్నారు.

250 మంది ఎంపిక

పట్టణంలో రహదారుల వెంబడి తోపుడు బళ్లు, చిన్న దుకాణాల్లో అల్పాహారం, పచ్చళ్లు, తినుబండారాలు విక్రయించే 250 మందిని తొలి విడతలో ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరంతా ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డు అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్సు పొందేలా అవగాహన కల్పించారు. పదార్థాల తయారీ, విక్రయాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

● దుకాణ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వంటకాల్లో తాగునీటిని మాత్రమే ఉపయోగించడం, ముడి పదార్థాలను నిల్వ చేసే విధానాలు, కూరగాయలు, మాంసాహారాన్ని కోసేందుకు వినియోగించే చాకులు, బోర్డులను వేర్వేరుగా వినియోగించడం తదితర నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా అవగాహన కల్పించారు.



నిబంధనల ప్రతులు చూపుతున్న చిరు వ్యాపారులు

విక్రయాలు పెరిగాయి



ఆహార పదార్థాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. అధికారుల సూచనల మేరకు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించడంతో విక్రయాలు పెరిగాయి. గతం కంటే ఎక్కువ మంది కొనుగోలుదారులు వస్తున్నారు.

- ఆర్.వరలక్ష్మి, హోటల్ నిర్వాహకురాలు

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నేటి నుంచి శిక్షణ తరగతులు

మార్టేరు, న్యూస్‌టుడే: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సోమవారం నుంచి సమగ్ర వ్యవసాయం- సస్యరక్షణ పద్ధతులపై ఐయిదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. గోదావరి మండలం పరిధిలో ఎంపిక చేసిన వ్యవసాయ, విస్తరణ అధికారులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ శిక్షణకు హాజరు కానున్నట్లు చెప్పారు.

విఘ్నేశ్వరుడికి పూజలు

మార్టేరు, న్యూస్‌టుడే: మండలంలోని మార్టేరు జడ్ వంతెన వద్ద ఉన్న వినాయక, అభయాంజనేయ స్వామివార్లకు ఆదివారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు.

రుద్రాభిషేకం

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లు క్షత్రియ కల్యాణ మండపంలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా శోభాయాత్ర, ప్రశాంతి పతాక ఆవిష్కరణ, గోమాత పూజ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వేదాధ్యయన విభాగం సమన్వయ కర్త కె.సాయిశ్రీహరి ప్రసాదశర్మ పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి పరమాత్మున్నిపై జ్ఞానం చేసుకోవడమే మోక్షమార్గమని అన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలిదిండి రామరాజు, డా. కె.ఎస్.వి.ఎన్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:

సమస్య: మల్లవరంలోని రక్షిత మంచినీటి పథకం చెరువుకు జిన్నూరు పంట కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసే పంప్ హౌస్‌పై, చుట్టూ తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి.

-ఎన్.సత్యనారాయణ, మల్లవరం

సమాధానం: పంప్ హౌస్ చుట్టూ శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి గంగాధరరావుకు సూచిస్తా. -కె.నాగేంద్ర కుమార్, ఈవోపీఆర్డీ, నరసాపురం

సమస్య: గ్రామం నుంచి తిల్లపూడి పాలెం వెళ్లే ప్రధాన రహదారి చెంత రజకుల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు పరివర్తకం తీగలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి.

-ఎన్.సత్య వెంకట నారాయణ, మల్లవరం

సమాధానం: పరివర్తకాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపడతాం. -కొల్లి సుధాకర్, విద్యుత్తు ఏఈఈ, నరసాపురం

చెత్త శుభ్రం.. పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ-దేవ మార్గంలో విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న వైనంపై ఈ నెల 16న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన వార్తకు పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు స్పందించారు. ప్రొక్లెయిన్‌తో చెత్తను తొలగింపజేశారు.

పంట బోదె బాగుపడింది...!

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దేవ పంట కాలువ అనుసంధాన బోదెలు వ్యర్థాలతో నిండిపోవడంతో ఎక్కడికక్కడే పూడిపోయి నీటి పారుదల జరగడం లేదని ఈ నెల 19న 'ఇలా ఉంటే.. సాగునీరు పారేదెలా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైంది. ఈ విషయమై స్పందించిన అధికారులు పంట బోదెలను కూలీలతో శుభ్రం చేయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాదులు తొలగింపు.. పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక బ్రాడీపేట లాన్సింగ్ వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి స్తంభానికి అల్లుకున్నాయని 'ఈనాడు'లో ఈ నెల 20న ప్రచురితమైంది. దీనిపై పట్టణ విద్యుత్తు ఏఈ బాబ్జీ స్పందించి ఆదివారం సిబ్బందిని పిచ్చిమొక్కలు, అల్లుకున్న తీగలను తొలగింపజేశారు.

కనిపించని అక్రమాలు!

జల్లెడపడితేనే అర్హులకు న్యాయం

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే

✦ పాలకొల్లు నియోజకవర్గంలో ఎనీడీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగికి వితంతు పింఛను నెల నెలా అందుతోంది. ఇక్కడి స్థానిక సచివాలయ అధికారులకు తెలిసినా పట్టించుకోవట్లేదు పదిలేస్తున్నారు. ఇదే గ్రామంలో అర్హత ఉన్నా పింఛను అందక ఇబ్బందులు పడుతున్న పేదలు అనేక మంది ఉన్నారు.

✦ యలమంచిలి మండలంలో ఏ మాత్రం వికలాంగత్వం లేకున్నా దివ్యాంగుల కోటాలో పింఛను పొందుతున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. గత వైకాపా పాలనలో నాయకుల సిఫార్సులతోనే ఈ బోగస్ పింఛన్లను పలువురు పొందారు.


పింఛను లబ్ధిదారులు

అనర్హుల ఏరివేత

కూటమి ప్రభుత్వం వచ్చాక పెంచిన మొత్తంతో ప్రస్తుతం అందిస్తున్న పింఛను భారంగా మారాయి. అర్హులకే అన్నీ అందితే భారమైనా భరించాల్సిందే. కానీ అనర్హులు సైతం అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు. వచ్చే జనవరినుంచి కొత్త పింఛన్లు అందిస్తామని ప్రభుత్వం తాజా ప్రకటనతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి ముందు పరిశీలన ద్వారా అక్రమ పింఛన్లు ఏరేస్తే ప్రభుత్వ ఖజానాకు కొంత ఊరటగా ఉంటుందని పలువురు అధికారులు చెబుతున్నారు.

నవంబర్ నుంచి దరఖాస్తుల స్వీకరణ

పింఛను పొందడానికి అర్హులైన వారినుంచి వచ్చే నవంబర్‌లో దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం భావిస్తుంది. అదే సమయంలో బోగస్ పింఛన్ల తొలగింపు ఉంటుంది.

మండలం	మొత్తం పింఛన్లు	రూ. కోట్లలో
ఆచంట	8,289	2.70
యలమంచిలి	10,366	4.24
పాలకొల్లు	9,090	3.82
నరసాపురం	11,158	4.62
పెనుగొండ	8,771	3.62
మొగల్తూరు	10,652	4.39
పెనుమంట్ర	8,307	3.45

అనంతరం గ్రామ సచివాలయాల దగ్గర అర్హుల జాబితా ప్రదర్శించి వివైనా అభ్యంతరాలుంటే స్వీకరించనున్నారు. అనంతరం జనవరిలో నిర్వహించే జన్మభూమి సభల్లో అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రతి మండలంలోను వందలాది బోగస్ పింఛన్లు ఉంటాయని, వాటిని తొలగిస్తే అర్హులకు కొత్తవి వెంటనే మంజూరు చేయవచ్చనే అభిప్రాయం అన్నివర్గాల్లోను వ్యక్తమవుతోంది. దీనిపై డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్‌ను సంప్రదించగా జనవరినుంచే కొత్త పింఛన్లు మంజూరు ఉంటుందన్నారు. బోగస్ ఏరివేతకు మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు.

వదలని వాన

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆచంట చినపేట, పెదపేట, పోర తదితర పాత కాలనీలతో పాటు పెనుమంచిలి, వేమవరం, వల్లూరు తదితర గ్రామాల్లోని శివారు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీలు లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. వర్షం వస్తే వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, పోర తదితర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మించుకున్న వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.


పెనుమంచిలి శివారు కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు

బండిముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో బండిముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవాలు



నరసాపురం, న్యూస్‌టుడే: మొగల్తూరు ముక్కువారి వీధిలో దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా పాలకొల్లు పట్టణంలో పలువురు కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవార్ల ప్రతిమలకు ఆదివారం పూజలు చేశారు. అనంతరం బ్యాండ్‌మేళం, గరగలు, టీన్‌మార్, శక్తి వేషాలతో గ్రామోత్సవం చేసి నిమజ్జనోత్సవం చేశారు. పలు చోట్ల అన్న సమారాధన నిర్వహించారు. యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొంతేలమ్మ గ్రామోత్సవం.. పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో దక్షిణపేట గౌతమి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం గొంతేలమ్మ మట్టి ప్రతిమకు పూజలు చేశారు. ప్రధాన వీధుల్లో యువకుల నృత్యాలు, బాణసంచా కాల్పులు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నరసాపురం కాలువలో నిమజ్జనం చేశారు.

వల్లెపండగ వాయిదా

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో సోమవారం నిర్వహించాల్సిన వల్లె పండగ కార్యక్రమాన్ని వాయిదా వేశామని సర్పంచి నక్కా శ్యామల సోని ఆదివారం తెలిపారు. కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) మృతి నేపథ్యంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాను సారం ఈ కార్యక్రమం వాయిదా వేశామన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



ఆకివీడు, న్యూస్‌టుడే: కుసుమ హరనాథ లీలా కల్యాణ మహోత్సవాన్ని ఆకివీడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్త బృందం సభ్యులు భజనలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల పోటీ తగదు

పాలకొల్లు, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల పోటీ తగదని సీబీటీయూ జిల్లా అధ్యక్షులు జె.ఎన్.వి.గోపాలన్ అన్నారు. స్థానిక సమతా మహిళా భవన్‌లో ఆదివారం ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామోహన్‌రాయ్ అధ్యక్షతన జరిగింది. గోపాలన్ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పి.డి.ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసమస్యలపై పోరాడే అవకాశాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయరామరాజు, ఎ.కె.వి.రామభద్రం, దిగుపాటి రాజగోపాల్, కె.రాజారామోహన్‌రాయ్, బి.సి.హెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.


యూటీఎఫ్ సభ్యులకు జ్ఞాపిక అందిస్తున్న నిమ్మల

వైద్య, రక్తదాన శిబిరాల ఏర్పాటు.. యూటీఎఫ్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక బీఆర్ఎంవీ బాలికల పాఠశాలలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ యూటీఎఫ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవలను అభినందించారు. అనంతరం సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, వెన్నెట్టి సుబ్బరాజు, విజయరామరాజు రామభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కోయ వెంకట కార్తిక్ తెలిపారు. మామిడూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో పార్టీ శ్రేణులు మన మామిడూరు మన బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల సేకరణ పత్రాన్ని విడుదల చేశారు. గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు షేక్ అలీ, నాయకులు చెన్నూరి శ్రీనివాస్, చిక్కాల నాగేంద్ర, నడపన రమేష్, వానపల్లి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


మన మామిడూరు-మన బాధ్యత వివరాల సేకరణ పత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

సురక్షిత నీరు అందించండి

పెనుమంట్ర, ఆచంట, న్యూస్‌టుడే: పెనుమంట్ర గ్రామ పంచాయతీ ప్రజలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయడంలో విఫలమైందని సీపీఎం గ్రామ కార్యదర్శి బి.విజయకుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

శ్మశాన వాటికలో చెత్త.. ఆచంట మండలం పెనుమంచిలిలో పంచాయతీ రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. గ్రామ శ్మశానవాటికలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించాలని, పెద్దచెరువు వద్ద మహిళలకు వస్త్రాలు మార్చుకోవడానికి గదులు నిర్మించాలని ఆదివారం తీర్మానం చేశారు. గ్రామ సీపీఎం కార్యదర్శిగా సిర్రా నరసింహమూర్తిని గ్రామ సభ ఆమోదించింది.

నాణ్యతకు నీళ్లు.. ఆధునికీకరణ ఎన్నాళ్లు!

ఇదీ పాలకొల్లు రైల్వేస్టేషన్ దుస్థితి

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ఒకట్రెండు పనులు కొనసాగుతుండగానే చేసిన పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. రెండో ప్లాట్‌ఫాంపై నిర్మించిన షెడ్డులో వర్షం వచ్చినప్పుడల్లా నీరు కారుతోంది. ప్రయాణికులు కూర్చునే బల్లలపై వర్షం కురుస్తుండటం సమస్యగా మారింది. నాలుగేళ్లుగా ఆధునికీకరణ పనులు మందకొడిగా సాగుతుండటం ప్రయాణికులకు అసౌకర్యంగా మారిందని పలువురు వాపోతున్నారు. ప్లాట్‌ఫాంపై షెడ్లు పెద్దవిగా నిర్మించకుండా మధ్యలో ఎక్కువగా ఖాళీ వదిలేయడంతో ఎండ, వర్షం నుంచి ఉపశమనం లభించడంలేదు. నేటికీ విద్యుదీకరణ పనులు పూర్తికాకపోవడం గమనార్హం.


విద్యుదీకరణకు తీగలు లాగుతున్న సిబ్బంది


షెడ్డు నుంచి వర్షపునీరు కారుతున్న ఆనవాళ్లు

ఎన్టీఆర్ ఘాట్‌లో పొంచిఉన్న ప్రమాదం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్‌ఘాట్‌లో భక్తుల పాలిట ప్రమాదం విద్యుత్తు స్తంభం రూపంలో పొంచిఉంది. ఈ రేవులో పుణ్యస్నానాలు చేసేందుకు, ఇతర పుణ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తుంటారు. రాత్రి సమయంలో ఇక్కడకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఇనుప స్తంభం ఏర్పాటు చేసి దానికి విద్యుత్తు దీపం అమర్చారు. ఆ స్తంభం మొదలు భాగంలో తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. మరో వారంరోజుల్లో కార్తిక మాసం ప్రారంభం కానుంది. గోదావరిలో దీపాలు వదిలేందుకు ప్రతిరోజూ వందలాదిమంది మహిళలు ఇక్కడకు తరలివస్తుంటారు. జనసంచారం ఉన్న సమయంలో ఈ స్తంభం కూలితే భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆ స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


(అంతర్ చిత్రంలో) మొదలు భాగం


తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్తు స్తంభం

అల్లిక గజిబిజి..!



నరసాపురం పొన్నపల్లిరేవు సమీపంలోని విద్యుత్తు స్తంభానికి పచ్చని తీగలు అల్లుకున్నాయి. నిర్వహణ కొరవడటంతో ఇలా మారిందని రాత్రిపూట వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. - ఈనాడు, నరసాపురం

రేవుల నిర్వహణకు నీళ్లొదిలారు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురపట్టణంలో గోదావరి రేవుల నిర్వహణకు పురపాలక సంఘ అధికారులు నీళ్లొదిలారు. పట్టణ పరిధి వశిష్ఠ గోదావరికి పలుచోట్ల గతంలో రేవులు నిర్మించారు. నిత్యం వందలాది మంది ప్రజలు, భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు ఇక్కడకు తరలివస్తుంటారు. ఇప్పటికే రేవుల్లో మెట్లకు ఏర్పాటుచేసిన టైల్స్ ధ్వంసమయ్యాయి. వాటిని తొలగించి నూతన నిర్మాణాలు చేపడతామని పురపాలక అధికారులు ఏడాది కాలంగా చెబుతూ వస్తున్నా ఆచరణకు నోచుకోలేదు. కొంతకాలంగా రేవుల్లో చెత్త తొలగించని దాఖలాలు లేవు. గోదావరి తీరంలో ముళ్లపొదలు, ఇతర మొక్కలు తొలగించకపోవడం తీరం చిట్టడవిని తలపిస్తుంది. మరో పదిరోజుల్లో కార్తిక మాసం ప్రారంభం కానుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రేవుల్లో మెట్ల మరమ్మతులు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' సమస్యను పురపాలకసంఘం కమిషనర్ ఎం.అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


మరమ్మతులకు గురైన జల్లుస్నానం సామగ్రి


గోదావరి తీరంలో పెరిగిన పొదలు

కొప్పర్రు- మత్స్యపురి మార్గం అధ్వానం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- భీమవరం నియోజకవర్గాల పరిధిలోని నరసాపురం- కొప్పర్రు, మత్స్యపురి ప్రధాన రహదారి గోతులమయమై ప్రమాదకరంగా మారింది. నరసాపురం పట్టణ పరిధిలోని చినమామిడిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు, మత్స్యపురి, కె.బేతపూడి తదితర గ్రామాల పరిధిలో కిలో మీటర్ల మేర రహదారి గోతులతో ధ్వంసమైపోయింది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, లారీలు, విద్యా సంస్థల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్డు మరింత అధ్వానంగా తయారయింది. రహదారితో పాటు నరసాపురం-వీరవాసరం మండలాలను అనుసంధానం చేసే గొంతేరు మురుగు కాలువపై వంతెన కూడా శిథిలమైంది. ఈ సమస్యపై ఆర్.భ శాఖ డీఈఈ జీవీఎస్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నరసాపురం వయా కొప్పర్రు, మత్స్యపురి భీమవరం ప్రధాన రహదారిపై పనులు చేపట్టేందుకు రూ.25 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.



మాజీ ఎమ్మెల్యే తనయుడి మృతి


లక్ష్మయ్యనాయుడు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ మాజీ ఎమ్మెల్యే కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు(చినబాబు) తనయుడు, వైకాపా నాయకుడు లక్ష్మయ్యనాయుడు(నానాజీ) (56) ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వైకాపా హయాంలో ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్‌గా, పెనుగొండ సహకార వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. నానాజీ తాత జవ్వాది శ్రీరంగనాయకులు, ముత్తాత లక్ష్మయ్యనాయుడు కూడా ఎమ్మెల్యేలుగా పనిచేశారు. నానాజీ మృతితో పెనుగొండ పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. అభిమానులు భారీగా పెనుగొండలో ఆయన స్వగ్రామానికి తరలివచ్చారు. హైదరాబాద్ నుంచి పార్థివదేహాన్ని తీసుకురావాల్సి ఉంది. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని తదితరులు సంతాపం తెలిపారు. నానాజీ అంత్యక్రియలు సోమవారం ఉదయం 11 గంటలకు పెనుగొండలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

నరసాపురం, న్యూస్‌టుడే: ఉన్నత విలువలతో కూడిన విద్యతో ఉత్తమ పౌరులుగా రాణించేందుకు వీలుంటుందని రాయల్‌క్లబ్ జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు సూచించారు. పట్టణంలోని గన్నాబత్తుల పెదతాతయ్య తులసమ్మ తెలగ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత తెలగ, బలిజ, కాపు సంఘం, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రవాస భారతీయ ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాయల్‌క్లబ్ పట్టణ శాఖ అధ్యక్షుడు జక్కం బాబ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 76 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో మాటా వ్యవస్థాపకుడు, కార్యదర్శి రావు అడ్డేపల్లి, అల్లు శివ, అల్లు వీర్రస్వామి, సీహెచ్ గోపాలకృష్ణ, మేకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు అందజేస్తున్న సత్యనారాయణరావు తదితరులు

అటు వైపు ప్రయాణం నరకమే..!

కొమ్ముచిక్కాల- ఆలమూరు మధ్య రహదారి గోతులుపడి అధ్వానంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రయాణమంటే అంతా భయపడుతున్నారు. రెండు మండలాల పరిధిలో ఉన్న ఈ రోడ్డు నిర్వహణను కొంతకాలంగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా వర్షాలకు ఎక్కడికక్కడే గుంతలు పడ్డాయి. రాత్రి సమయంలో ఇవి చోదకుల పాలిట ప్రాణసంకటంగా మారాయి. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ప్రదీప్ మాట్లాడుతూ రహదారులకు మరమ్మతులు చేయనున్నామని చెప్పారు. -పోడూరు, న్యూస్‌టుడే


గుంతలు పడిన రహదారి

తాడేపల్లిగూడెం
•తాడేపల్లిగూడెం •తణుకు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి రోజు వ్యాయామంతో పాటు ఎముకలు దృఢంగా ఉండటానికి అవసరమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఆర్థోపెడిక్ వైద్యులు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య పేర్కొన్నారు. ప్రపంచ బోలు ఎముకల వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి భాస్కరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ


బాలికలతో మాట్లాడుతున్న జడ్జి సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. నాణ్యమైన ఆహారం అందేలా సిబ్బంది కృషి చేయాలన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి పురస్కరించుకుని ఆదివారం అత్తిలిలో కల్యాణ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి గరికలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి భక్తులు వివిధ రకాల పండ్లతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారి ఊరేగింపు

పడాల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్),న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పడాలలోని శ్రీరామ్ నగర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఉచిత వైద్య సేవలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఇంటింటికి వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, మండపాక, వెంకటరాయపురం ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన రోగులకు వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఔషధాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం .. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కడకట్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుధాకర్ బాబు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 143 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 22 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేయగా 11 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సుంకర శ్రీనివాసరావు, పచ్చా వెంకటేశ్వరరావు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక.. రీఛార్జ్ చేస్తేనే విద్యుత్తు

ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు


స్మార్ట్ మీటరు అమర్చుతున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మొన్నటి వరకు పోస్టు పెయిడ్ విధానంలో విద్యుత్తు బిల్లులు చెల్లించే వాళ్లం. వాటి స్థానంలో స్మార్ట్ (ప్రీ పెయిడ్) మీటర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై ముందస్తుగా రీ ఛార్జ్ చేసుకుంటేనే విద్యుత్తు వినియోగించుకునే అవకాశం ఉంది. రూ.కోట్లలో పేరుకుపోతున్న విద్యుత్తు బకాయిల సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం స్మార్ట్ మీటర్లను వినియోగంలోకి తీసుకొస్తోంది. ఇకపై విద్యుత్తు బిల్లులు ఎగ్గొట్టే అవకాశం ఉండదు. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఈ విధానం ఇప్పటికే కొనసాగుతోంది. ఈ మేరకు ప్రయోగాత్మకంగా ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు.

తాడేపల్లిగూడెం డివిజినల్ విద్యుత్తు కార్యాలయం పరిధిలో తణుకు, గూడెం నియోజకవర్గాలతో పాటుగా గణపవరం, ఇరగవరం మండలాలు ఉన్నాయి. తొలి విడతలో స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత గృహ సముదాయాలు, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయం తదితర రంగాల్లో బిగించనున్నారు. గత నెల రోజుల వ్యవధిలో ప్రత్యేక బృందాలు సర్వే చేపట్టి 432 కార్యాలయాలను గుర్తించారు. ఆయా కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా ఇప్పటి వరకు 431 స్మార్ట్ మీటర్లు అమర్చి వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. రెండో విడతలో వాణిజ్య సముదాయాల్లో కూడా స్మార్ట్ మీటర్లను బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా అమర్చిన స్మార్ట్ మీటర్లలోని లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మిగతా రంగాల్లో కూడా వీటిని అమర్చనున్నారు.

తాడేపల్లిగూడెం విద్యుత్తు డివిజనల్ కార్యాలయం

విభాగం	విద్యుత్తు కనెక్షన్లు
గృహాలు	208994
వాణిజ్య	28397
పరిశ్రమలు	782
వ్యవసాయం	6700

భిన్నమైన పనితీరు

ప్రతినెల 10వ తేదీ లోపు ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్(ఐఆర్) పోర్ట్ మీటర్ల ద్వారా సిబ్బంది రీడింగ్ తీసి విద్యుత్తు బిల్లులు ఇస్తుంటారు. కొన్ని రోజుల వరకు బిల్లు చెల్లించేందుకు గడువు ఇస్తారు. ఆపై కూడా మరికొద్ది రోజుల వరకు అపరాధ రుసుముతో బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది. అప్పటికి చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తుంటారు. స్మార్ట్ మీటరు రాకతో ఆ విధానానికి పూర్తిగా స్వస్తి పలకనున్నారు. వినియోగదారులు ముందుగానే విద్యుత్తు వినియోగం మేరకు చరవాణి, డీటీహెచ్ మాదిరిగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్సు ఉన్నంత వరకు నిర్విరామంగా విద్యుత్తు సరఫరా అవుతుంది. ఎంత విద్యుత్తు వినియోగించాం, ఇంకా ఎంత బ్యాలెన్సు ఉందో అనే వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే ఈ పరిజ్ఞానం పూర్తిగా అందుబాటులోకి వచ్చేంత వరకు ప్రస్తుతానికి స్కానింగ్ విధానంలోనే బిల్లులు అందజేస్తారు.

దశలవారీగా ఏర్పాటు

దశలవారీగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో అమర్చాం. త్వరలో వాణిజ్య సముదాయాల్లో కూడా ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో ప్రీ పెయిడ్ విధానంలో విద్యుత్తు సేవలు అందించే అవకాశం ఉంది.
- కె.నరసింహామూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: భాగ్యలక్ష్మి పేట రేలంగి చిత్రమహల్ రోడ్డులో మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. **- మహాలక్ష్మి, స్థానికురాలు**
సమాధానం: రోడ్డు మీదకు మురికి నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం. **- ఏసుబాబు, కమిషనర్**
సమస్య: స్థానిక 31వ వార్డులో ఇంటింటికి చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది రావడం లేదు. ఫలితంగా ఇళ్లల్లో చెత్త పేరుకుపోతోంది. **- సాగర్, స్థానికుడు**
సమాధానం: చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటాం. **- ఏసుబాబు, కమిషర్**
సమస్య: స్థానిక తితిదే కల్యాణ మండపం వద్ద ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. వర్షపు నీరు చేరడంతో దోమలు, విష సర్పాలకు నిలయాలుగా మారాయి. **- దీపక్, స్థానికుడు**
సమాధానం: ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఏసుబాబు, కమిషనర్**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం శేషమహల్ రోడ్డులోని చిన ఆంజనేయ స్వామి ఆలయం వెనుక రోడ్డులో మురుగుబోదెలో వ్యర్థాలు మేట వేశాయి. **- రవి, స్థానికుడు**
సమాధానం: మురుగుబోదెలో చెత్త తొలగింపజేస్తాం. **- శ్రీమన్నారాయణ,శానిటరి ఇన్‌స్పెక్టర్**
సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం తాళ్లముదునూరుపాడులోని ఎస్సీ కాలనీలో పురపాలక కుళాయి నీరు సరిగా రాక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు **- సుబ్బారావు, స్థానికుడు**
సమాధానం: ఎస్సీ కాలనీలో పురపాలక నీరు సమృద్ధిగా వచ్చేలా చర్యలు చేపడతాం **- ఏసుబాబు,పురపాలక కమిషనర్**

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని బ్యాంక్ కాలనీలో గ్రంథాలయం సమీపంలో వ్యర్థాలు ఇళ్లమధ్య గుట్టలుగా వేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. **- రాజు, స్థానికుడు**
సమాధానం: వ్యర్థాలు ఇళ్ల మధ్య వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- గోవిందు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు బీసీ కాలనీలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఇళ్లల్లో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు సచివాలయం-2 వద్ద ఉన్న స్థలంలో పడేస్తున్నారు. దోమల ఉద్ధృతి పెరిగి రాత్రిళ్లు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. **- సురేష్, స్థానికుడు**
సమాధానం : చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూస్తాం. దోమల మందు పిచికారీ చేస్తాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**
సమస్య : పెంటపాడు మండలం మౌంజీపాడు ఉప్పరకాలనీలో డ్రెయిన్లు వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగు రహదారిపైకి చేరుతోంది. రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణ, స్థానికుడు**
సమాధానం : పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపడతాం. **- ప్రసాద్, ఈవోపీఆర్డీ**


ఎమ్మెల్యే బొలిశెట్టిని సత్కరిస్తున్న కళావేదిక సభ్యులు

కళాకారులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: సమాజంలో మంచిని ప్రేరేపించే కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బుద్దాల కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కళావేదికలు ఎందరో కవులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆధునిక యుగంలో కళలకు సరైన ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరుగున పడుతున్న కళలు ఇంకా జీవం పోసుకుంటున్నాయని పేర్కొన్నారు. పట్టణంలో టౌన్‌హాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం


నినాదాలు చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు దళితులందరూ కలిసి పోరాడాలని అత్తిలి మండల దళిత నాయకులు వినయోబాబు తెలిపారు. అత్తిలి సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళితులందరూ కలిసి సాగాలని ఆల్ ఇండియా దళిత హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగరాజు దళిత హక్కులపై అవగాహన కల్పించారు. త్వరలోనే అత్తిలి మండల దళిత ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని దళిత నాయకులు యాళ్ల స్వామి అన్నారు.

తాడినాడకు కవితా పురస్కారం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన కవి, రచయిత సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడి భాస్కరరావుకు కవితా పురస్కారం దక్కింది. 'సుగంధ సౌరభం' అనే కవితకు అవార్డు దక్కినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కన్వీనర్ కొల్లి రమావతి భాస్కరరావును శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు.

చర్మకారుల సంక్షేమానికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: చర్మకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని దళిత సేన నాయకులు కోరారు. దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశం రాష్ట్ర కార్యదర్శి కారకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన రామన్నగూడెంలో ఆదివారం నిర్వహించారు. దళిత సేన వ్యవస్థాపకుడు రవిప్రకాశ్ మాట్లాడారు. చీలి మోహనరావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మిత్రమా నీ జాడెక్కడ?

అంతరిస్తున్న పురుగులు


గుడ్లు తింటూ రక్షణ

పంటలను ఆశించే పచ్చ, లద్దె పురుగులు గుడ్లు పెట్టి సంతానం పెంపొందించుకుంటాయి. ఇవి పంట ఆకులు, లేత భాగాలపై గుడ్లు పెడతాయి. అలా గుడ్ల నుంచి బయటకొచ్చిన వాటి సంతతి పూత ఆకు, పిందెలు తింటూ పంటకు నష్టం కలిగిస్తాయి. ట్రైకోగ్రామా అనే మిత్ర పురుగు పచ్చ, లద్దె పురుగుల సంతతి పెరగకుండా పంటను రక్షిస్తుంది. అక్షింతల పురుగులు దోమ, నల్లి, తామర తదితర పురుగులను తింటాయి.

సాలీడు, తూనీగ

పొలాలకు సమీప తుప్పలు, చెట్లపై సాలీడు గూళ్లు ఉంటే పచ్చ, లద్దె పురుగుల సంతతి, రెక్క పురుగులు, దోమలు, నల్లులు ఇరుక్కుపోతాయి. వీటిని సాలీడులు తిని సంతతిని నివారిస్తాయి. చీడ పురుగులు, పంటలపై పెట్టిన గుడ్లను తూనీగలు తినడమే కాకుండా పరపరాగ సంపర్కం జరగడానికి దోహదపడతాయి.

పెంటపాడు, న్యూస్‌టుడే : పేరుకు పురుగులే అయినా కొన్ని రకాల కీటకాలు రైతులకు చాలా మేలు చేస్తాయి. ప్రస్తుతం రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో వీటి జాడ కనుమరుగైపోతోంది. క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి వాడుకోవడంతో శత్రుపురుగులతో పాటు పంటలను సంరక్షించే మిత్ర పురుగులు సైతం అంతరించిపోతున్నాయి. దీనిపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం మండలంలో 11,540 హెక్టార్లు, పెంటపాడు మండలంలో 23,048 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా పురుగుమందుల వినియోగంతో నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



రూపాయి ఖర్చు లేకుండా..

కందిరీగ, మిడత, పొడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు పంటను ఆశించే చీడపీడ సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతన్న పంటకు రక్షణగా నిలుస్తున్నాయి. కానీ కర్షకుల నిర్లక్ష్యం కారణంగా అవి నశించిపోతున్నాయి. ముఖ్యంగా క్రిమిసంహారక మందులు అతిగా పిచికారీ చేయడంతో మిత్ర పురుగులు చనిపోతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అవసరం మేరకే వినియోగించాలి

క్రిమి సంహారక మందులు అవసరం మేరకు వినియోగిస్తే మిత్ర పురుగులను రక్షించుకోవచ్చు. కొందరు మోతాదు మించి వాడటంతో వాటిపై ప్రభావం పడుతోంది. పంటపై ఒకటి, రెండు చీడ పురుగులు కనబడితే నివారణ మందులు వాడాల్సిన అవసరం లేదు.
- మురళీకృష్ణ, ఏడీఏ, తాడేపల్లిగూడెం

లెక్కలో మొక్కలేవీ?

☛ రక్షణ లేక చనిపోతున్న వైనం ☛ ఉపాధి నిధులు వృథా


పెంటపాడు, దర్శిపర్రు మార్గంలో కొబ్బరిమొక్కల పరిస్థితి


వల్లూరుపల్లిలో ఇలా..

పెంటపాడు, న్యూస్‌టుడే : రహదారులు, పుంతమార్గాలకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలను సంరక్షించేవారు లేకపోవడంతో చాలా వరకు చనిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక పథక లక్ష్యం నీరుగారిపోతోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా పెంటపాడు మండలంలో 10,500 మొక్కలు (కొబ్బరి, నేరేడు, గానుగ)లకు పైగా ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, కాలువగట్లు, పుంత రహదారుల వెంబడి నాటారు. సంరక్షణ లేకపోవడంతో సగానికి పైగా చనిపోయాయి. గతంలో సామాజిక తనిఖీ సమయంలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటినా ప్రస్తుతం అవి కూడా ఎండకు ఎండుతూ రక్షణ కరవై చనిపోతున్నాయి. కొన్ని మొక్కలను పశువులు తినేస్తున్నాయి.

ఇలా చేయాలి..

నాటిన తరువాత పంచాయతీలే పర్యవేక్షించాలి. సంరక్షించేందుకు ప్రత్యేకంగా కూలీలను నియమించాలి. నెలకు మొక్కకు రూ.15 చెల్లించాలి. ఒక కిలోమీటరు దూరం పనికి ఒక కూలీ ఉండాలి. కిలోమీటరుకు దాదాపు 400 మొక్కల లెక్కన నెలకు రూ.6 వేలు ఆ కూలీకి అందజేయాలి. ఎప్పుడైనా మొక్క చనిపోతే దానికి నగదు చెల్లించరు. సంరక్షణకు ఇచ్చే నిధులను ఉపాధిహామీ విభాగం పంచాయతీకి చెల్లించాలి. అయితే క్షేత్ర స్థాయిలో ఇలా జరగడం లేదు.

జరుగుతోంది ఇలా..

అధికారులు, పంచాయతీల నిర్లక్ష్యం కారణంగా మొక్కలు నాటి తర్వాత వాటి పర్యవేక్షణ, సంరక్షణ బాధ్యతలు తీసుకునే వారు కరవయ్యారు. వేసవిలో ఒక్కసారైనా నీరుపోసిన దాఖలాలు ఎక్కడా లేదు. దీనికితోడు రక్షణగా ఏర్పాటుచేసిన పాత దుస్తులు బలహీనంగా ఉండటంతో గాలి వేగం, పశువుల నుంచి అవి మొక్కల్ని కాపాడలేకపోతున్నాయి. నాటిన తర్వాత సంరక్షణ బాధ్యతను ఉపాధి కూలీలు, క్షేత్ర సహాయకులు, సంబంధిత గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇలా అందరూ తీసుకోవాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో ఇలా ఎక్కడా జరగడం లేదు. 'చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటిస్తాం. క్షేత్రస్థాయిలో వందశాతం మొక్కలు ఉండేలా చర్యలు తీసుకుంటాం. రోజూ గమనించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకుంటాం' అని సాంకేతిక సహాయకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలంటూ నిరసన

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం ఉమామహేశ్వరంలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి సమీపంలోని ఆక్రమణలు తొలగించాలంటూ ఆరుంధతి యువజన సంఘం నాయకులు, పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి జగనన్న కాలనీ వరకు రహదారి వెంబడి కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్లు, దుకాణాలు నిర్మించుకున్నారని ఆరోపించారు. మురుగుకాలువ, పంటబోదె, పశువులకు వైద్యం అందించే ప్రదేశాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ధాన్యం ఆరబోసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన గ్రామ రెవెన్యూ, పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో గాయాలు

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో విద్యుత్తు స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో లైన్‌మెన్ విద్యుదాఘాతానికి గురై, గాయపడిన ఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... ఇదే గ్రామానికి చెందిన పొలిమేర నాగ శివ శంకర్ జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి వర్షం కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు స్పందించి తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

గల్లంతవుతున్న గట్లు


కాలువగట్టును ఆక్రమించి ఇటుకబట్టీల నిర్వహణ

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : ఏలూరు కాలువగట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. గట్టుపై చెట్లు, ముళ్లపొదలు తొలగించి ఆక్రమణకు పాల్పడుతున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు చూసుకొని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. మరికొంతమంది ఇంటికి సంబంధించిన పెంకులు, సిమెంటు దిమ్మెలు, కొబ్బరి మట్టల వంటి వ్యర్థాలను గట్లపైనే పడేస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల రహదారి ఉందనుకొని ఎవరైనా రాత్రిళ్లు అంచు దిగితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కాలువకు ఇరువైపులా గట్లు బలహీన పడటంతోపాటు కుచించుకుపోతున్నాయి. పట్టణ పరిధిలో సెంటు భూమి ధర రూ.లక్షల్లో పలుకుతుండగా అందరి కళ్లు ఖాళీగా దర్శనమిస్తున్న కాలువ గట్లపైనే పడుతున్నాయి. దీంతో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం మండలం నందమూరు నుంచి ప్రారంభమై నవాబ్‌పాలెం, కృష్ణయ్యపాలెం, పెంటపాడు మండలం ప్రత్తిపాడు, తాడేపల్లిగూడెం పట్టణం, పడాల, ముత్యాలంబపురం, బాదంపూడి మీదుగా ఏలూరు కాలువ ప్రవహిస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులు స్పందిస్తూ..కాలువ గట్టును ఆక్రమిస్తే సిబ్బందిని పంపించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఆదివారం కూరగాయల ధరలు కొండెక్కాయి. టమాట,బెండ, దోస, ఆనబకాయ ధరలు నాలుగు వారాలతో పోలిస్తే రూ.20 నుంచి రూ.30 వరకు ఉండేవి. సరఫరా తగ్గడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.



కూరగాయ	కిలో ధర.రూ.ల్లో.
బీరకాయ	60
వంకాయ నలుపు,తెలుపు	80
చిక్కుళ్లు నాటు, హైబ్రీడు	40
బంగాళా దుంప	50
పచ్చిమిర్చి	60
టమాట	50
ఉల్లి	50
దొండ	30
బెండ	60
క్యారెట్	60
అల్లం	100
కాకర	40
దోస	50
ఆనబకాయ	40
కొత్తిమీర (కట్ట)	20

నేడు పశు వైద్య శిబిరం

గణపవరం, న్యూస్‌టుడే: జల్లికొమ్మర రైతు సేవా కేంద్రంలో సోమవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డి.ఎం.నాయక్ తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభిస్తారన్నారు. చూలు కట్టని, ఎదకు రాని పశువులను పరీక్షించి మందులు అందిస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు

యోగానందం..!

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



"ఆసనాలంటే ఆసక్తి. వ్యాయామ ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తూ క్రీడా కోటాలో కొలువు సాధించడమే లక్ష్యం." అని ఏడో తరగతి విద్యార్థి రాజేశ్ పేర్కొన్నారు.



"యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో ఆసనాలపై పట్టు సాధిస్తున్నాను. పతకాలపై గురిపెట్టడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా" అని ఆరో తరగతి విద్యార్థిని అర్జుల మానస అన్నారు.

దండగర్ర (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: వారిది పల్లెటూరి నేపథ్యం..పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ముందుకు సాగుతున్నారు తాడేపల్లిగూడెం మండలం దండగర్ర పాఠశాల విద్యార్థులు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పర్యవేక్షణలో వ్యాయామ (యోగా) ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



"యోగాలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటా. ఐపీఎస్‌గా సేవలు అందించాలని లక్ష్యం." అని ఆరో తరగతి విద్యార్థి పాలూరి చిరంజీవి అన్నారు.



'యోగాలో జాతీయ స్థాయి గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం. చదువుతో పాటు యోగా అంటే ఇష్టం. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పోటీల్లో రాణించి పతకం గెలుస్తానని నమ్మకం ఉంది''అని ఏడో తరగతి విద్యార్థి రాపాక వినయ్ కుమార్ పేర్కొన్నారు.

